

కలెక్టరేట్‌లో ప్రజావాణిలో వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందన (ఫైల్)

నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
3 ఖమ్మం, శనివారం 7 డిసెంబర్ 2024 BHADRADRI KOTHAGUDEM

## సమన్వయంతోనే సొసైటీల అభివృద్ధి : భద్రాద్రి కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ) : గ్రామీణ ప్రాంతాల్లో సొసైటీల అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లాస్థాయి సహకార అభివృద్ధి కమిటీ(డీసీడీసీ) సమావేశం కలెక్టర్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా రైతులకు ఉపయోగపడే విధంగా సహకార సంఘాలు పని చేయాలన్నారు. జిల్లాలో పాడి పరిశ్రమ అభివృద్ధికి పశు సంవర్ధక శాఖ అధికారులు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. అజోల్ల, పశుగ్రాసం పెంపకంపై దృష్టి సారించి వృద్ధి చేయడానికి మరింతగా కృషి చేయాలన్నారు. డీసీసీబీ, నాబార్డు సహకారంతో నూతన పరిశ్రమలు ఏర్పాటు చేసి పలువురికి ఉపాధి కల్పించాలన్నారు. జిల్లా మత్స్య శాఖ అధికారులు ఆసక్తి ఉన్న మహిళలకు చేపల పెంపకంపై శిక్షణ ఇవ్వాలని, చేపల పెంపకం యూనిట్లు నెలకొల్పడానికి నాబార్డు రుణ సహాయం అందించవచ్చన్నారు. మొక్కజొన్న పండించే ప్రాంతాల్లో మొక్కజొన్న ఆకుల ద్వారా దాణా తయారీ పరిశ్రమల స్థాపనకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో చంద్రశేఖర్, జిల్లా వ్యవసాయాధికారి బాబురావు, జిల్లా సహకార అధికారి సయ్యద్ ఖుర్షీద్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి, మత్స్యశాఖ అధికారి ఇంతియాజ్ ఖాన్ పాల్గొన్నారు.

# అర్జీల పరిష్కారం అంతంతే..



ప్రజావాణికి బారులు తీరిన ఫిర్యాదుదారులు (ఫైల్)

- కలెక్టరేట్‌లో సగానికి సగం ప్రజావాణి కార్యక్రమాలు రద్దు
- జనవరి నుంచి ఇప్పటివరకు 2,367 ఫిర్యాదులు
- వీటిలో పరిష్కారం అయినవి 1,169
- పెండింగ్‌లో 843, వివిధ శాఖల వద్ద 355 దరఖాస్తులు
- గ్రీవెన్స్‌లో వినతుల సమర్పణకు సంశయిస్తున్న ప్రజలు

భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ) : ప్రజావాణిలో పలు సమస్యలపై బాధితులు సమర్పించిన దరఖాస్తులు అంతంతమాత్రంగానే పరిష్కారమవుతున్నాయి. కలెక్టరేట్‌లో వారం వారం ప్రజావాణి(గ్రీవెన్స్) కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెబుతున్నా.. ఇందులో రద్దు చేసిన కార్యక్రమాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. దీంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చి తమ సమస్యలపై అర్జీలు సమర్పించేందుకు ప్రజలు ఆసక్తి చూపడం లేదని తెలుస్తున్నది. మాది ప్రజా పాలన అని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం గ్రీవెన్స్ నిర్వహణలో క్షేత్రస్థాయిలోనే విఫలమైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. కలెక్టర్ గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరించాల్సి ఉండగా.. వివిధ పనుల్లో బిజీగా ఉండడం వల్ల అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలే ఆ కార్యక్రమాన్ని నడిపించాల్సిన పరిస్థితి ఏర్పడింది. తమ అపరిష్కృత సమస్యలపై వినతులు సమర్పించినా ఎంతకూ పరిష్కారం కాకపోవడంతో ప్రజలు విసుగు చెందుతున్నారు. దీనికి అర్జీలు సమర్పించడం ఎందుకని చర్చించుకుంటున్నారు.

### పేరుకే వారం వారం.. రద్దయినవే ఎక్కువ..

కలెక్టర్ పర్యవేక్షణలో ప్రతి సోమవారం అన్ని శాఖల జిల్లా అధికారులతో నిర్వహించాల్సిన ప్రజావాణికి చాలా మంది అధికారులు వివిధ సాకులు చెప్పి డుమ్మా కొడుతున్నారు. కనీసం కిందిస్థాయి ఉద్యోగులు కూడా గ్రీవెన్స్‌కు హాజరుకావడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. దీంతో తమ సమస్యలు పరిష్కారం కావడం లేదని బాధితులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో జనవరి నుంచి ఇప్పటివరకు 49 వారాలపాటు జరిగిన ప్రజావాణిలో 24 సోమవారాలు కొన్ని కారణాల వల్ల కార్యక్రమాన్ని రద్దు చేశారు. ఇందులో కొన్ని పండుగ సెలవు దినాలు వస్తే.. మరికొన్ని మంత్రుల పర్యటనలు, భద్రాచలం వద్ద వరదలు తదితర కారణాల వల్ల రద్దు చేసినట్లు కలెక్టరేట్ అధికారులు ప్రకటించారు. ఇందులో గత కలెక్టర్, ప్రస్తుత కలెక్టర్లు 15 గ్రీవెన్స్‌లకు హాజరు కాగా.. మరో 10 గ్రీవెన్స్‌లకు అదనపు కలెక్టర్లు హాజరయ్యారు. ఒకానొక దశలో అదనపు కలెక్టర్ కూడా లేకుండా గ్రీవెన్స్ నిర్వహించిన సందర్భాలున్నాయి.

### అర్జీ ఇవ్వాలా? వద్దా?

ప్రతి గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు ఇచ్చినా పరిష్కారం కావడం లేదు. దీంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే బాధితులు అర్జీలు ఇవ్వాలా.. వద్దా.. అని సంశయిస్తున్నారు. ఎంతో దూరం నుంచి వచ్చినా మా సమస్యకు పరిష్కారం లభించడం లేదని ఆరోపిస్తున్నారు. ప్రతి నియోజకవర్గంలో కలెక్టర్ సమక్షంలో ప్రజావాణి నిర్వహిస్తే మేలు జరుగుతుందని తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

### 2,367 ఫిర్యాదులకు.. 1,169 పరిష్కారం

జిల్లాలో ఏజెన్సీ ప్రాంతం ఎక్కువగా ఉండడం వల్ల భూ సమస్యలపైనే ఫిర్యాదులు అధికంగా వస్తున్నట్లు సమాచారం. అయితే వాటికి పరిష్కారం లభించకపోవడంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చి వినతులు సమర్పించిన వారు ఇంతమాత్రానికి గ్రీవెన్స్ ఎందుకు పెడుతున్నారని ప్రశ్నిస్తున్నారు. ఫిర్యాదుల్లో ఎక్కువగా.. అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు ఇప్పించాలని, తల్లిదండ్రులు చూడడం లేదని, వికలాంగుల పింఛన్లు ఇవ్వాలని, కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలని, రైతు బీమా, రైతు భరోసా రావడం లేదని, పోడు భూములకు పట్టాలు ఇప్పించాలని పేర్కొంటున్నారు. లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల పంచాయతీ పరిధిలో తాము సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని పలుమార్లు ఫిర్యాదు చేసినా పరిష్కారం లభించలేదని గిరిజన బాధితులు ఆరోపిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా జనవరి నుంచి ఇప్పటివరకు 2,367 ఫిర్యాదులు రాగా.. అందులో 1,169 పరిష్కారం అయినట్లు అధికారులు లిఖిత పూర్వకంగా పేర్కొన్నారు. 843 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా.. 355 దరఖాస్తులను ఆయా శాఖలకు పంపించినట్లు లెక్కలు చూపించారు.

### ఫిర్యాదు ఇచ్చినా పట్టించుకోట్లే..



జిల్లాకు మంత్రులు వస్తే ప్రజావాణి బంద్ పెడుతున్నారు. ఇక ప్రజావాణికి వచ్చిన వాళ్ల పరిస్థితి ఏమిటి. ప్రైవేటు స్కూల్స్‌లో టెట్, బీఈడీ లేకుండానే విద్యాబోధన చేస్తున్నారు. దీనిపై చర్య తీసుకోవాలని మూడుసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ప్రజా పాలన అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ నేతలు.. మంత్రుల పర్యటన సందర్భంగా ప్రజావాణి రద్దు చేయడం ఎంతవరకు సమంజసం.

–మూడ్ బాలాజీనాయక్, విద్యార్థి సంఘం నాయకుడు, చంద్రుగొండ

### ఫిర్యాదులపై స్పందన లేదు..



భద్రాచలం పట్టణంలోని తాతగుడి సెంటర్‌లో దేవుడి స్థలాన్ని కొందరు పెద్దలు కబ్జా చేశారు. నేను ఇప్పటికీ అక్కడే పూజలు చేస్తున్నా. ఆ భూమిని రక్షించాలని ప్రజావాణిలో పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందన కరువైంది. ఆర్డీవో, పీవో, కలెక్టర్ సార్లందరికీ వినతులు ఇచ్చాను. ఇక సమస్య ఎలా పరిష్కారం అవుతుందో మీరే చెప్పండి.

–రెహమాన్, భద్రాచలం



ఖమ్మం బీఆర్‌ఎస్ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న వద్దిరాజు, తాతా మధు, కొండబాల

# రాజ్యాంగ ప్రదాతకు ప్రణామాలు

**ఉమ్మడి జిల్లాలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కు పూలమాలలతో ఘన నివాళి**

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతిని బీఆర్‌ఎస్, వివిధ పార్టీలు, పలు సంఘాల ఆధ్వర్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లావ్యాప్తంగా శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఖమ్మంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం (తెలంగాణ భవన్)లో అంబేద్కర్ చిత్రపటానికి రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, బీఆర్‌ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. మణుగూరు పట్టణంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో బీఆర్‌ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సత్తుపల్లి మండలం కిష్టారంలో అంబేద్కర్ చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, మధిర పట్టణంలో అంబేద్కర్ విగ్రహానికి జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, ఇల్లెందు కొత్త బస్టాండ్ సెంటర్‌లో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు దిండిగాల రాజేందర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. -నమస్తే నెట్‌వర్క్



మధిర : అంబేద్కర్‌కు నివాళి అర్పిస్తున్న లింగాల కమల్‌రాజు



మణుగూరు టౌన్ : అంబేద్కర్‌కు నివాళి అర్పిస్తున్న రేగా కాంతారావు



ఇల్లెందు : నివాళి అర్పిస్తున్న దిండిగాల, సిలివేరి, నాయకులు



సత్తుపల్లి :అంబేద్కర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సండ్ర

# కేసులు, జైళ్లు మాకు కొత్తకాదు..

- ప్రతిపక్ష నాయకులను అణచివేస్తున్న రేవంత్‌రెడ్డి
- మాజీమంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై పోలీసుల తీరు ఆక్షేపణీయం
- అసెంబ్లీ వేదికగా ప్రజా సమస్యలపై రేవంత్‌ను నిలదీస్తాం
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యే సండ్ర





మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యే సండ్ర

ఖమ్మం, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్ష నాయకులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నదని, ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చలేని రేవంత్‌రెడ్డి బీఆర్‌ఎస్ నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తూ కాలం వెల్లదీస్తున్నాడని బీఆర్‌ఎస్ పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఖమ్మం నగరంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయం(తెలంగాణ భవన్)లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తాతా మధు మాట్లాడుతూ రాష్ట్ర ప్రతిష్టతను దెబ్బతీసే విధంగా రేవంత్‌రెడ్డి పాలన ఉందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రశ్నించే గొంతుకనవుతాను అని చెప్పిన రేవంత్‌రెడ్డి అధికారం రాగానే ప్రశ్నించే ప్రతిపక్ష నాయకులను అణచివేస్తున్నారని అన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలకు పోలీస్‌స్టేషన్లు, కేసులు కొత్తేమీ కాదన్నారు. బెదిరింపులకు భయపడతామని అనుకోవడం కాంగ్రెస్ నాయకుల అవివేకమే అవుతుందని అన్నారు. రాష్ట్రంలో పోలీసు వ్యవస్థతో రాజ్యమేలాలని చూస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇకనైనా తీరు మార్చుకోకపోతే ప్రజాక్షేత్రంలో మరింత చులకన అవుతారన్నారు. ఈ నెల 9వ తేదీ నుంచి జరిగే శీతాకాల సమావేశాల్లో అసెంబ్లీ వేదికగా ప్రజా సమస్యలపై బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులుగా గొంతెత్తుతాం అన్నారు. మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిలపై పోలీసులు వ్యవహరించిన తీరు రాష్ట్ర ప్రజలందరినీ ఆశ్చర్యపరిచిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలన చేతకాక ప్రతిపక్ష నాయకులపై దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి హోదాలో రేవంత్‌రెడ్డి మాట్లాడే భాష తీరుకు ప్రజలు ఛీ కొడుతున్నారని, ముఖ్యమంత్రి వచ్చి అబద్దాలు చెప్పుతున్నాడని, చివరికి దేవుళ్లను కూడా మోసం చేస్తున్నాడన్నారు. రాష్ట్రంలో గురుకుల పాఠశాలల్లో నెలకొన్న దుర్భరమైన పరిస్థితులకు ముమ్మాటికి రేవంత్‌రెడ్డే కారణమన్నారు. గురుకుల పాఠశాలలో చదివే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ బిడ్డలకు కాంగ్రెస్ ప్రభుత్వం శాపంగా మారిందని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు, రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడే విషయాలపై రేవంత్‌రెడ్డి దృష్టి పెట్టాలని హితవు పలికారు. స్థానిక ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెబుతారన్నారు. సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా ప్రతిపక్ష నాయకులను అణచివేసేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేస్తున్న కుట్రలను న్యాయస్థానాల వేదికగా ఎదుర్కొంటామని అన్నారు. ప్రజా సమస్యలను ప్రశ్నించే ప్రతిపక్ష నాయకుల గొంతులను అణచివేయడం కాంగ్రెస్ ప్రభుత్వం తరంకాదన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, బీఆర్‌ఎస్ ఖమ్మంరూరల్ మండల అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్, ఖమ్మం నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, నాయకులు శెట్టి వీరభద్రం, డేరంగుల బ్రహ్మం, ఉద్యమకారులు డోకుపర్తి సుబ్బారావు, పగడాల నరేందర్, గుండ్లపల్లి శేషగిరిరావు, లింగనబోయిన సతీష్, మహర్షి, సద్దాం షేక్, బలుసు మురళీకృష్ణ పాల్గొన్నారు.

## వైభవంగా లక్ష్మీనరసింహదాసు జయంతి

### రామాలయ మాడవీధుల్లో గిరిప్రదక్షిణ



విస్తా కాంప్లెక్స్ వద్ద రాజా తూము లక్ష్మీనర్సింహదాసు విగ్రహానికి పూజలు చేస్తున్న అర్చకులు

భద్రాచలం, డిసెంబర్ 6 : దశవిధ ఉత్సవాల రూపకర్త రాజా తూము లక్ష్మీనరసింహదాసు 234వ జయంతిని భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఆలయ అర్చకులు, వేద పండితులు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. తొలుత లక్ష్మీనరసింహదాసు చిత్రపటానికి అభిషేకం నిర్వహించి గిరిప్రదక్షిణగా ఆలయ మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం విస్తా కాంప్లెక్స్ వద్దకు ప్రదర్శనగా వెళ్లి ఆయన విగ్రహానికి అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. జయంతి కార్యక్రమంలో భాగంగా ఆయన కీర్తనలను ప్రాచుర్యంలోకి తెస్తున్న ప్రముఖ సినీ గాయకుడు నేమినేని పార్థసారథిని ఆలయ ఉద్యోగులు, అర్చకులు సన్మానించారు. ఆలయంలోని ప్రాకార మండపంలో లక్ష్మీనరసింహదాసు భక్తి సంగీత కార్యక్రమాలను సాయంత్రం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రమాదేవి, ఏఈవో శ్రావణ్‌కుమార్, ఈఈ రవీందర్, ఏవో భవానీకృష్ణ, ఆలయ సూపరింటెండెంట్ సాయిబాబా, అర్చకులు, ఆలయ ఉద్యోగులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# హోంగార్డుల సేవలు ప్రశంసనీయం

### హోం గార్డ్స్ 'రైజింగ్ డే' వేడుకల్లో ఎస్పీ రోహిత్ రాజు



వేడుకల్లో హోం గార్డుకి కేక్ తినిపిస్తున్న ఎస్పీ రోహిత్ రాజు

కొత్తగూడెం క్రైం, డిసెంబర్ 6 : పోలీసులతో సమానంగా బాధ్యతగా విధులు నిర్వర్తిస్తున్న హోంగార్డుల సేవలు ప్రశంసనీయమని ఎస్పీ బిరుదరాజు రోహిత్ రాజు అన్నారు. హోం గార్డుల ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని కొత్తగూడెం ఐఎంఏ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం జరిగిన వేడుకల్లో ఎస్పీ ముఖ్యఅతిథిగా పాల్గొని శాంతి కపోతాన్ని ఎగురవేసి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వరదలు సంభవించినప్పుడు, ఎన్నికల సమయంలో, రోజువారీ విధుల్లో హోం గార్డులు అంకితభావంతో సేవలందిస్తున్నారని కొనియాడారు. నిత్యం క్రమశిక్షణతో మెలుగుతూ పోలీస్ శాఖ ప్రతిష్టను మరింత ఇనుమడింపజేసేలా విధులు నిర్వర్తించాలని సూచించారు హోం గార్డ్ ఆఫీసర్స్ సంక్షేమానికి ప్రతి క్షణం పోలీస్ శాఖ ముందుంటుందని తెలిపారు. త్వరలో ఉద్యోగ విరమణ పొందుతున్న 9 మంది హోం గార్డ్ ఆఫీసర్స్‌కు ఈ సందర్భంగా ఎస్పీ బహుమతులు అందజేశారు. విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఆరుగురికి ప్రశంసాపత్రాలను అందజేశారు. హోం గార్డ్ రైజింగ్ డే సందర్భంగా అందరితో కలిసి కేక్ కట్ చేసి సంబురాలను పంచుకున్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆపరేషన్స్ టి.సాయిమనోహర్, ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, డీఎస్పీలు షేక్ అబ్దుల్ రెహమాన్, ఆర్.సతీశ్‌కుమార్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ ఎం.నాగరాజు, ఇన్‌స్పెక్టర్లు సంజీవ్‌కుమార్, ముప్పారపు కరుణాకర్, టి.రమేశ్, కాగితోజు శివప్రసాద్, సురేశ్, టి.కరుణాకర్, ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు.

# ఆశ్రమ పాఠశాల ఎదుట బీఆర్‌ఎస్వీ నాయకుల నిరసన

### ఇల్లెందు ఆశ్రమ పాఠశాలలోకి అనుమతించకపోవడంపై ఆందోళన



ఇల్లెందు గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల గేటు ఎదుట బైఠాయించి నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్వీ నాయకులు

ఇల్లెందు, డిసెంబర్ 6 : బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన గురుకుల బాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల సందర్శనకు వెళ్లిన బీఆర్‌ఎస్వీ నాయకులను లోపలికి అనుమతించకపోవడంతో గేటు ఎదుట నిరసనకు దిగారు. బీఆర్‌ఎస్వీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఎన్ఎన్.రాజు ఆధ్వర్యంలో జిల్లా మహిళా నాయకురాలు సింధు తపస్విలను లోపలికి వెళ్లనీయకపోవడంతో పాఠశాల గేట్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని గిరిజన గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల్లో కలుషిత ఆహారం తిని పలువురు విద్యార్థులు అనారోగ్యం పాలై మృతిచెందారని తెలిపారు. ఆశ్రమ పాఠశాలల్లో సమస్యలు తెలుసుకోవడానికి వెళితే అడ్డుకోవడం ఏమిటని వారు ప్రశ్నించారు. హాస్టళ్లలో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించి, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ నాయకులు గిన్నారపు రాజేశ్, సత్తాల హరికృష్ణ, రాహుల్ గౌడ్, అఖిల్, మహర్షి, వినయ్, ముఖేష్, పుష్ప తదితరులు పాల్గొన్నారు.